భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

● కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



కొండపైన భక్తురాలితో మాట్లాడుతున్న కలెక్టర్

మల్యాల, మే 31: కొండగట్టులో జరుగుతున్న పెద్ద హనుమన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా తెలిపారు. జయంతి ఉత్సవాల రెండవ రోజు శుక్రవారం రాత్రి కలెక్టర్ కొండపైన ఏర్పాట్లను పరిశీలించారు. చలువ పందిళ్లు, తాగునీరు, క్యూలైన్‌లు ఏర్పాటుతో భక్తులకు అసౌకర్యం లేకుండా మారిందని, కొండపైన 120 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశుద్యానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఈవో చంద్రశేఖర్, డీపీవో దేవరాజ్ ఉన్నారు



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న దీక్షాపరులు



అరటి పళ్లతో స్వామి వారికి అలంకరణ



నెత్తిన ముడుపులతో వస్తున్న దీక్షాపరులు

దారులన్నీ కొండగట్టుకే..

- తరలివస్తున్న దీక్షాపరులు, భక్తులు
- రెండో రోజు వైభవంగా ఉత్సవాలు
- నేడే హనుమాన్ పెద్ద జయంతి

మల్యాల, మే 31: శ్రీరామ జయ రామ.. జయ జయ రామ.., రామ లక్ష్మణ జానకీ జై.. జై బోలో హనుమాన్ కీ.. అనే దీక్షాపరుల సంకీర్తనలు, వేలాదిగా తండోపతండాలుగా వస్తున్న దీక్షాపరులు, భక్తుల జై హనుమా న్ ఘోషతో కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధానం పులకిస్తోంది. రామనామ సంకీర్తనలతో అంజన్న పరిసరాలు భక్తి పారవశ్యంతో నిండి పోతున్నాయి. రామదండును తలపించేలా భక్తులు కొండగట్టుకు వస్తుండ గా ఆలయం కాషాయ వర్ణంతో కళకళలాడుతోంది. గురువారం నుంచి ప్రారంభమైన హనుమాన్ జయంతి ఉత్సవాలతో కొండంతా భక్తజన శోభితంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లానుంచే కాకుండా ఉమ్మడి హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాలు తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా దీక్షాపరులు కాలి నడకన, వాహనాల్లో కొండపైకి చేరుకుని మాల విరమణ చేస్తున్నారు.

● కొనసాగుతున్న జయంత్యుత్సవాలు..

హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకుని కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం యాగశాలలో వేదపండితులు, అర్చకులు స్థాపిత దేవతారాధ న, హోమం, సుందరకాండ పారాయణం, పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, విష్ణు సహస్రనామ పారాయణం, అమ్మవారి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు మండలంలోని రామన్నపేటకు చెందిన పోచమ్మల ప్రవీణ్ అందజేసిన రెండు వేల అరటిపళ్లతో ఆంజనేయస్వామి మూలవిరాట్టును అలంకరించారు. కార్యక్రమంలో జయంతి వేడుకల ప్రత్యేక అధికారులు రామకృష్ణ, వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, ఆలయ స్థానాచార్యులు తిరుక్కోవెల కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు, ఉపప్రధానర్చకులు చిరంజీవ స్వామి, మారుతీ అర్చకులు పాల్గొన్నారు. సాయంకాలం ఆలయ ఆవరణలో కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



బందోబస్తు పోలీసులకు సూచనలిస్తున్న సీఐ నీలం రవి

● హనుమాన్ జయంతికి ఏర్పాట్లు..

కొండగట్టు అంజనేయ స్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ పెద్ద జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతియేటా వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతి త్రైయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వేలాది దీక్షాపరులు మాల విరమణ చేసేందుకు కొండగట్టుకు తరలివస్తు న్నారు. గురువారం నుంచి ఆలయం ముందు గల యాగశాలలో త్రైయా హ్నిక ఉత్సవాల యాగాన్ని మహా వైభవంగా నిర్వహిస్తుండగా శనివారం వైశాఖ బహుళ దశమి రోజు కావడంతో హనుమాన్ జయంతి నిర్వహించనున్నారు.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి లేఖ

జగిత్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 1,654 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలో సుమారు 56 మంది పనిచేస్తున్నారని వివరించారు. పీరియడ్ వారిగా వేతనం చెల్లించడంతో పాటు పండుగల సెలవులు, వేసవి సెలవుల్లో పీరియడ్లు తగ్గడంతో వేతనంలో కోత పడుతుందని తెలిపారు. రెండు, మూడు నెలలకు ఒక సారి వేతనాలు చెల్లి స్తుండడంతో గెస్ట్ లెక్చరర్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో దుర్భర జీవితం గడుపుతున్నాయని వివరించారు. తరగతి పీరియడ్ వేతన చెల్లింపు విధాంన తొలగించి, ప్రతి నెల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించే విధానం అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి పంపిన లేఖలో ఎమ్మెల్సీ కోరారు.

అత్యాచారం కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు శిక్ష

ఒక్కొక్కరికి రూ. 5 వేల జరిమానా

జగిత్యాల టౌన్, మే 31: ఒంటిరిగా సైకిల్‌పై వెళుతున్న ఓ యువతిపై ఇద్దరు అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితులకు 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ. 5 వేల చొప్పున జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లా బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ యువతి ధర్మపురి మండలంలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి 2018 ఫిబ్రవరి 11న వెళ్లింది. ఇంటి వద్ద అమ్మమ్మ లేకపోవడంతో పొలం వద్దకు సైకిల్‌పై వెలుతుండగా తీగల ధర్మారం గ్రామానికి చెందిన మేర నగేష్, కొమిరె సాయిలు అనే ఇద్దరు వ్యక్తులు అడ్డగించి యువతిని బలవంవతంగా మామిడి తోటకు తీసుకవెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి అరుపులు విని పక్క పొలంలో పనిచేస్తున్న మహేష్ వెళ్లడంతో నిందితులు పారిపోయారు. బాధితురాలు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులతో పాటు ధర్మపురి పోలీసులకు అదే రోజు రాత్రి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అదనపు పీపీ మల్లేశం కేసు వాదించగా కోర్టు డ్యూటీ పోలీసులు కిరణ్‌కుమార్, శ్రీధర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు మేర నగేష్, కొమిరె సాయిలుకు 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

లక్ష్మీబాయి మృతికి సీనియర్ సిటిజన్స్ సంతాపం

జగిత్యాల అర్బన్, మే 31: మాజీ గవర్నర్, కేంద్ర మంత్రి పి. శివశంకర్ సతీమణి లక్ష్మీబాయి మృతిపట్ల తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్, పెన్షనర్స్ వివిధ సంఘాల ప్రతినిధులు లక్ష్మీబాయి ఫొటోకు పూలమాలవేసి, ఆమెకు ఆత్మశాంతి కలగాలని కోరుతూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు బయటకు రాని కాలంలోనే ఆధ్యాత్మిక భావాలు కలిగిన, విద్యావేత్తగా అనేక సామాజిక సేవ లు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంతరెడ్డి, వెలమల ప్రకాష్, సతీష్‌రాజ్, బండారి విజయ్, గంగం జలజ తదితరులున్నారు.

విద్యార్థుల యూనిఫారాలు సకాలంలో అందిస్తాం

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సంపత్‌రావు



యూనిఫారాలను పరిశీలిస్తున్న సంపత్‌రావు

జగిత్యాలరూరల్, మే 31 : ప్రభుత్వ పాఠశాల చదివే విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫారంలు సకాలంలో అందించేలా చర్యలు చేపట్టామని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సంపత్‌రావు అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్, పొలాస, పొరండ్ల, గ్రామాల్లో మహిళసంఘాల ద్వారా రూపొందిస్తున్న దుస్తులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ ఆయా మండలాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాల ద్వారా యూనిఫారాలను కుట్టిస్తామన్నారు. మహిళలకు ఇది మంచి అవకాశమని, ఇంకా ఎక్కువ సంఖ్యలో మహిళలలు ముందుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో డీపీఎంలు విజయభారతి, మల్లేశం, ఏపీఎం ఓదెల గంగాధర్, సీసీలు గంగారాం, బి. రవీందర్, విఓఏలు, వీవో అధ్యక్షురాళ్ల పాల్గొన్నారు.

బీడీ కమిషన్ ఏజెంట్లకు కమిషన్ పెంపు

జగిత్యాల అర్బన్, మే 31: బీడీ కమిషన్ ఏజెంట్లకు 2024 మార్చి 31తో జరిగిన ఒప్పందం ముగిసినందున తిరిగి ఏజెంట్ల కమిషన్ పెంచాలని బీఎంఎస్ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీస్ ఇచ్చినట్లు బీఎంఎస్ బీడీ కమిషన్ ఏజెంట్స్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ కుమార్ తెలిపారు. బీఎంఎస్ విజ్ఞప్తి మేరకు మే 20న నిజామాబాద్‌లో జరిగిన చర్చలు విఫలమయ్యాయన్నారు. తిరిగి మళ్లీ చర్చలు జరపగా రెండవసారి జరిగిన చర్చలు సఫలమవడంతో వెయ్యి బీడీలకు గానూ కమిషన్ ఏజెంట్స్‌కు 4.50పైసలు చెల్లిస్తామని బీడీ యాజమాన్యాలు అంగీకరించాయన్నారు. గతంలో ఉన్న అన్ని కమిషన్‌లు కలుపుకొని రూ.22.60పైసలు చెల్లిస్తామని హామీ ఇచ్చామన్నారు. ఈ చర్చల్లో బీడీ కార్మిక సంఘ్ సంఘటన కార్యదర్శి పెద్ది శివయ్య, ఏజెంట్స్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మోత్కూరి శ్రీనివాస్, బొమ్మిడి శ్రీనివాస్ ఉన్నట్లు సుధీర్‌కుమార్ తెలిపారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

అదనపు ఎస్పీ వినోద్ కుమార్

జగిత్యాల టౌన్, మే 31 :ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని జిల్లా అదనపు ఎస్పీ వినోద్ కుమార్ అన్నారు. పదవీ విరమణ పొందిన ఏఎస్సై సత్యనారాయణ సన్మాన సభను శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ పోలీస్ శాఖకు 33 సంవత్సరాలు అందించిన సేవలను గుర్తించి షాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జానీమియా, ఆర్ఎస్సై కృష్ణ ఉన్నారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగిని సన్మానిస్తున్న అదనపు ఎస్పీ

పొగాకు వాడకంతో ఆరోగ్యంపై ప్రభావం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మల్యాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాల టౌన్, మే 31 : పొగాకు వాడకాన్ని అరికట్టి పర్యావరణాన్ని రక్షించేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి సమియోద్దీన్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మోతె మాలవాడ ఆరోగ్య కేంద్రం నుంచి పాత బస్టాండ్ వరకు ఆశ, ఆరోగ్య కార్యకర్తల ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఉప వైద్యాధికారి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణంపై పొగాకు పరిశ్రమ హానికరమైన ప్రభావం చాలా ఎక్కువగా ఉందన్నారు.

భారతదేశంలో దాదాపు 267 మిలియన్ల మంది పొగాకును ఉపయోగిస్తున్నారని, ఇది వారి ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి జైపాల్‌రెడ్డి, డీపీవో స్వామి, వైద్యాధికారులు స్వాతి, చైతన్య రాణి, సూపర్ వైజర్లు సత్యనారాయణ, శ్రీధర్, సాగర్‌రావు, మురళి, శ్యాం సుందర్, శ్రీనివాస్, సీవోలు మధు, మాధురి, సృజన్ ఉన్నారు.

మల్యాల: మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో ప్రపంచ పొగాకు వ్యతిరేఖ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మౌనిక పొగాకు వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. వివిధ రకాల క్యాన్సర్లకు కారణమయ్యే పొగాకుకు దూరంగా ఉండాలని ప్రజలకు, రోగులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆసుపత్రిలో రోగులతో కలిసి పొగాకు వినియోగించమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రూప, సరిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాలాల పూడికతీత పనుల్లో వేగం పెంచాలి

జగిత్యాల టౌన్, మే 31 : నాలాల పుడీకతీత పనుల్లో వేగం పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఉన్న నాలాలు, అంతర్గత డ్రైనేజీలను శుక్రవారం చైర్ పర్సన్ పరిశీలించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలకు వరద ముప్పు కలగకుండా పూడీకతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం వార్డు ప్రజల సమస్యలను అగిడి తెలుసుకున్నారు. కౌన్సిలర్ కొలగాని ప్రేమలత సత్యం తదితరులు ఉన్నారు.

అంజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

మల్యాల, మే 31: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న పెద్ద హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. రెండవ రోజు కొండపైకి వచ్చిన విప్ అంజన్నను దర్శించుకున్నా రు. అనంతరం యాగశాలలో నిర్వహిస్తున్న త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు

వైభవంగా శ్రీరాముని శోభాయాత్ర

కొడిమ్యాల, మే 31 : మండల కేంద్రంలో హనుమాన్‌సేవా సమితి ఆధ్వర్యంలో హన్మాన్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి శ్రీరాముని శోభాయాత్రను దీక్షాపరులు వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి శ్రీరాముని చిత్ర పటాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తి శ్రద్ధలతో భజన చేస్తూ ఆలయానికి చేరుకున్నారు.



శ్రీరాముని ఊరేగింపు చేస్తున్న దీక్షాపరులు

దడపుట్టిస్తున్న అగ్నిప్రమాదాలు



రాయికల్ మండలం కుమ్మరిపల్లి షెడ్డులో ఎగిసిపడుతున్న మంటలు

రాయికల్, మే 31: ఓ వైపు ఠారెత్తిస్తున్న ఎండలు..మరోవైపు అగ్నిప్రమాదాలు సంభవించి జిల్లా ప్రజలకు దడ పుట్టిస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అగ్నిప్రమాదాలు చోటు చేసుకుని ఆస్తి నష్టం వాటిల్లింది. మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలో గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అంబల్ల ప్రతాప్‌రెడ్డికి చెందిన కోళ్ల ఫారం షెడ్డులో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రూ.12 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. 500 వరకు గడ్డి కట్టలు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

● ఆయిల్‌పామ్ చెట్లు దగ్ధం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని దమ్మ మల్లిక అనే రైతు సాగు చేసిన ఆయిల్‌ఫామ్ చెట్లు దగ్ధమైనట్లు బాధితురాలు మల్లిక తెలిపారు. మోరపల్లి గ్రామంలో మల్లిక అనే మహిళా రైతు తన సర్వేనంబర్ 484లో గత సంవత్సరం తన నాలుగు ఎకరాల భూమిలో ఆయిల్‌పామ్ తోటను సాగుచేయగా తోటలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నిప్పంటించినట్లు ఆరోపించారు. ఈఘటనలో తోటలోని 30 చెట్లతోపాటుగా డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. సుమారు 30 వేల రూపాయల నష్టం జరిగిందని ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.

● అగ్ని ప్రమాదంలో ద్విచక్ర వాహనాలు..

జగిత్యాల టౌన్ : జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న అన్వేష్ అనే వ్యక్తి చెందిన మెకానిక్ షెడ్డులో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసు కుంది. ఈ ప్రమాదంలో షెడ్డులో ఉన్న 20 ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి పారేయడంతో అగ్ని ప్రమాదం జరిగినటు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే మామిడితోటలో అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు చెందిన మామిడితోటలో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన ఫైర్ అధికారులు సకాలంలో అక్కడికి చేరకుకొని మంటలను ఆర్పివేశారు.



వడదెబ్బతో ముగ్గురి మృతి

చొప్పదండి, మే 31: చొప్పదండి, వీణవంక మండలాల్లో, పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలో వడ దెబ్బతో ముగ్గురు మృతి చెందారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జాకీర్ హుస్సెన్(60) పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని సిమెంట్ ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్‌గా పనిచే స్తున్నాడు. శుక్రవారం సిమెంట్ బస్తాల లోడ్‌తో లారీని చొప్పదండికి తీసుకురాగా రహదారి పక్కన నిలిపి మంచినీరు తాగి లారీ వద్ద ఒరిగిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసుల కు సమాచా రం అందించగా లారీ నంబర్ ఆధారంగా మృతుడి వివరాలను తెలుసుకు న్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీణవంక: మండల కేంద్రానికి చెందిన కళ్యాణం రామక్క (75) వడ దెబ్బతో శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం రెండు రోజులుగా ఎండ వేడి తీవ్రంగా ఉండడంతో పాటు వేడి గాలి వీయడంతో వడ దెబ్బకు గురై మృతి చెందింది. మృతురా లు రామక్కకు ఇద్దరు కొడుకులు, నలుగురు కూమార్తెలు ఉన్నారు.

జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌కు చెందిన ఈదు నూరి కిషోర్(34) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. హనుమాన్ మాల ధరించిన కిషోర్ తోటి భక్తులతో కలిసి ఉదయం పాదయాత్రగా జగిత్యాల జిల్లా కొండగట్టుకు బయలుదేరాడు. ఎండవేడి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయాడు. అతడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

కోనరావుపేట, మే 31: కోనరావుపేట మండలం నాగారం మర్తనపేట గ్రామాల మధ్యలో బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు కాగా గ్రామస్థులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వేములవాడ మండలం మారుపాకకు చెంది న మోడిక రవి తన బైక్‌పై మారుపాకకు వస్తుండగా నాగారం-మర్తన్ పేట గ్రామాల మధ్యలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. గాయా లైన రవిని మర్తన్‌పేట మాజీ సర్పంచ్ వంశీ, లింగాల సత్తయ్య గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- విరిగిపడిన కరెంట్ పోల్
- షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన టీవీలు, రిఫ్రిజిరేటర్లు



గొల్లపల్లిలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న లారీ

తిమ్మాపూర్, మే 31: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఓ లారీ విద్యుత్ పోల్‌ను ఢీ కొట్టడంతో స్తంభం విరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం ఓ లారీ గొల్లపల్లి నుంచి గుండ్లపల్లి వెళుతున్న క్రమంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో నడుపుకుంటూ వచ్చి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్‌ను లారీతో ఢీకొట్టాడు. దీంతో స్తంభం విరిగి పడి రోడ్డుపై పడిపోయింది. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగ డంతో పలు ఇళ్లలో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఇతర పరికరాలు కాలిపోయాయి. గ్రామస్థు లు గమనించి రోడ్డుపై ఉన్న లారీని అడ్డుకు న్నారు. డ్రైవర్ అక్కడినుంచి తప్పించుకొని పారిపోయాడు. లారీ డ్రైవర్ మద్యం మత్తు లో డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరి గిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రేణికుంట వద్ద రాజీవ్‌రహదారిపై ఉన్న టోల్ గేటును తప్పించుకునేందుకు గ్రామా ల నుంచి లారీలు వెళుతుండటంతో ప్రమా దాలు జరుగుతున్నాయని గ్రామస్థులు అంటున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం


ఆత్మహత్యాయత్నం చేసిన ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ముస్తాబాద్, మే 31: మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్థు లు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నామాపూర్‌కు చెందిన తలారి బుచ్చయ్య(45) అనే ట్రాక్టర్ డ్రైవర్ కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు బుచ్చయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

రైతును బెదిరించిన ఇద్దరి అరెస్ట్

చందుర్తి, మే 31: భూమిని చదును చేసుకుంటున్న ఓ రైతు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి ఎస్‌ఐ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. కథనం ప్రకారం మండలం లింగంపేట గ్రామా నికి చెందిన కమటం లక్ష్మిరాజం అనే రైతు గత నెల 23 తెల్లవారుజామున భూమిని ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో భూమిని చదును చేయిస్తున్నాడు. వేములవా డ పట్టణానికి చెందిన కొలగాని చందు, ఖమ్మం రమాకాంత్ అనే ఇద్దరు వ్యక్తులతో పాటు ఇద్దరు వ్యక్తులు వ్యవసాయ భూమిని చదును చేస్తున్న రైతు వద్దకు వెళ్లి మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు ఉన్నాయా అంటూ బెదిరింపులకు పాల్పడి, రూ. 40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ పంపామన్నారు. లింగంపేటకు చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.











తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

» వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...

» అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?

» కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

» టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

» ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?

» మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిల్లరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

» రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనునన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

» అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

» అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జనభర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

» కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?

» మహేష్ కుమార్ గౌడ్

» సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ. వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మి, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తుచేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

» అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు

» ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు

» లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?

» 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు

» విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

» సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనకున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరంన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్, తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ఆలయాల్లో హనుమాన్ దీక్షాపరులు పూజలు



ధర్మపురి ఆలయంలో స్వామి దర్శనం కోసం క్యూ లైన్‌లో ఉన్న భక్తులు

ధర్మపురి, మే 31: ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భారీగా భక్తుల రద్దీ పెరిగింది. పెద్ద హనుమాన్ జయంతి పురస్కరించుకుని క్షేత్రానికి అనేక మంది హనుమాన్ దీక్షాపరులు, భక్తులు తరలి వచ్చారు. లక్ష్మీ నరసింహ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. క్షేత్రానికి చేరుకున్న హనుమాన్ దీక్షాపరులు, భక్తులు గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి లక్ష్మీ నృసింహ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చారణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. భక్తుల దాహార్తి తీర్చడం కోసం ఆలయ ఆవరణలో, గోదావరి నది వద్ద చలి వేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

●ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ పి. విద్యాసాగర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం సందర్శించారు. వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం వారందరు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఈవో శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.



చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న ఈవో

రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ

ధర్మపురి, మే 31: ధర్మపురి పీఏసీఎస్ ఆవరణలో రైతులకు పచ్చి రొట్టె విత్తనాలు అయిన జీలుగ బస్తాలను శుక్రవారం డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారం పెరగటానికి ఈ విత్తనాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఆసక్తి కలిగి ఉన్న రైతులు భూమి పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని సంఘ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. జీలుగ బ్యాగ్ 30 కిలోలకు సంబంధించిన ధర రూ 1116 ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ షేర్ల రాజేశం, సీఈవో అయ్యోరు రాజేష్, మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్, పాలకవర్గ సభ్యులు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, గుర్రాల పెద్దపోశం, జాజాల లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కబడ్డీ పోటీలు

గొల్లపల్లి, మే 31 : గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. కబడ్డీ పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారు. పోటీలను తిలకించేందుకు గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలు జట్లు పోటీల్లో పాల్గొని ప్రథమ విజేతగా నిలిచేందుకు హోరా..హోరీగా పోరాడాయి. ప్రథమ విజేతకు ముదం జానారెడ్డి రూ. 5 వేల నగదు బహుమతిని, ద్వితీయ విజేతకు పాదం రాజయ్య రూ. 3 వేల నగదు బహుమతులను అందజేయనున్నారు. గ్రామీణ ప్రాంత యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు

నియోజక వర్గంలోని అభివృద్ధి చూపాలి

జిల్లా ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌పటేల్

మెట్‌పల్లి, మే, 31 : కోరుట్ల నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి చూపాలని జిల్లా ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమావేశంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, కొమ్ముల సంతోష్‌రెడ్డిలతో కలిసి మాట్లాడుతూ జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావులపై ఆరోపణలు చేయడానికి సిగ్గుండాలని విమర్శించారు. జిల్లాలో రైస్ మిల్లుల అవినీతి, అనుమతి లేని వెంచర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఘనత కాంగ్రెస్ నాయకులదని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే షుగర్ ఫ్యాక్టరీ మూసి వేయడం, ఇంజనీరింగ్ కాలేజిని తరలించడం, ఖాదీలో అవినీతి, వడ్ల కొనుగోలులోని తరుగు తీయడం వంటి వాటిని అభివృద్ధి అంటారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, భరత్, మహిపాల్‌రెడ్డి, శివ, కేస హరీష్‌కుమార్, సురేష్, లింబాద్రి, వెంకటేష్, భూమేష్, నాగరాజు పాల్గొన్నారు.

త్వరలోనే అందుబాటులోకి మినీ స్టేడియం

వేములవాడ రూరల్, మే 31 : వేములవాడలో మినీ స్టేడియాన్ని త్వరలోనే అందు బాటులోకి తీసుకొస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలం లోని చెక్కపల్లిలో లయ యూత్ 30 వార్షికోత్సవం సందర్బంగా జిల్లా ఇన్విటేషన్ కబ డ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతందని, మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. క్రీడల్లో గెలు పోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం లభించేలా చర్యలు తీసుకుం టామన్నారు. పలువురు నాయకులు, టోర్నమెంటు నిర్వాహకులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఉద్యోగి పదవీ విరమణ

వేములవాడ టౌన్, మే 31: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఎలక్ట్రికల్ ఏఈ శేఖర్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఆలయ ఈవో రామకృష్ణ తన కార్యలయంలో శేఖర్‌ను సన్మానించారు. ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హరికిషన్, గౌరవ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి శ్రీనివాస్, ఈఈ రాజేష్, ఏఈవో ప్రతాప నవీన్, వెంకన్న ఉన్నారు.

ప్రాణాలను హరిస్తున్న రోడ్డు ప్రమాదాలు

మెట్‌పల్లి రూరల్, మే 31: రోడ్డు ప్రమాదాలు ప్రాణాలను హరిస్తున్నాయి. మెట్‌పల్లి పరసరాల ప్రాంతాల్లో వరుస రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది ప్రాణాలు కోల్పో తుండగా కొందరు క్షతగాత్రులుగా మిగులుతున్నారు. ఎన్ని చర్యలు తీసుకుంటున్న ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గడం లేదు. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల వేలాది మంది బతుకులు గాలిలో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మలుపుల వద్ద ఇరుకు రోడ్లు, వంతెనలను వద్ద జరుగుతున్నాయి. ప్రమాదాలు ఎక్కువగా జాతీయ వెంటా ఉన్న మండలంలోని బండలింగాపూర్, రాజేశ్వరరావుపేట, మేడిపల్లి, వేంకట్‌ట్రావుపేట, మెట్‌ఎల్లి, ఆరపేట, చౌలమద్ది, మారుతీనగర్ గ్రామాల్లో జరుగుతున్నాయి. గత మూడు రోజుల క్రితం మెట్‌పల్లి పట్టణానికి చెందిన తండ్రి కొడుకు మేడిపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 24 గంటల వ్యవధిలోనే కొడుకు మృతి చెందగా తండ్రి రెండు కాళ్లు, చేయి విరిగి తీవ్ర గాయాల య్యాడు. ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి ప్రాణాలను కోల్పోవడం జరుగుతునే ఉన్నాయి.

● ప్రమాదాలకు గల కారణాలు..

గతంలో పోలిస్తే రహదారులు సైతం పెద్దవై వేగాన్ని నిరోధిం చకుండా నడుపుతున్న సమయంలో ఒక్క క్షణం అజాగ్రత్త వహించినా ప్రమాదాల బారిన పడక తప్పని పరిస్థితి నెలకొంది. రోడ్డు ప్రమాదాలనేవి చాలా రకాలుగా జరుగుతున్నాయి. అజాగ్రత్త, మద్యం మత్తులో వాహనాలు నడపడం, అతివేగం, రహదారులు సరిగ్గా కనబడక పోవడం, తెల్లవారు జామున నిద్రమత్తులో వాహనాలు నడపడం, అనుకోకుండా

›› అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రధాన కారణం

ఏదైనా అకస్మాత్తుగా వాహనాలకు అడ్డురావడం, రోడ్డు భద్రతపై అవగాహన లేకపోవడం, అనుకోకుండా వాహనంలో ఏమైనా సమస్యలు ఏర్పడడం వల్ల కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కొక్కసారి ఎదుటి వాహనం అజాగ్రత్త కారణంగా ప్రమాదాలు .జరుగుతున్నాయి. వాహనాల్లో ఎక్కువ మంది ప్రయాణం, హెల్మెట్ ధరించక పోవడం, సీటుబెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల సైతం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెబుతున్నారు. మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం, ముఖ్యమైన ప్రదేశాల్లో క్రాసింగ్‌లు సరిగ్గా కనిపించక పోవ



మితిమీరిన వేగం ప్రాణాంతకం..

వాహనదారులు నిబంధనలకు మించి అతి వేగంతో వాహనాలను నడిపించి ప్రమా దాల బారిన పడొద్దు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి గ్రామంలో కళాబృందాలతో అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రోజు పెట్రోలింగ్ చేపట్టి వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. వాహ నదారులు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలి. నిద్రమత్తు, మద్యం సేవించి, అజాగ్రత్తతో అతివేగంగా వాహనాలను నడపకూడదు.

- చిరంజీవి, మెట్‌పల్లి ఎస్సై



బండలింగాపూర్ శివారులో ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

డం, సిగ్నల్స్ లేకపోవడం వల్ల సైతం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సూచిక బోర్డులు, హెచ్చరిక చిహ్నాలు ఉండక పోవడం, ఒక్కో చోట ఇరుకుగా రహదారులు ఉండడ వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. వంతెనలపై దెబ్బతినడం, రోడ్లు దెబ్బతిని గుంతలు పడడం, డివైడర్లు లేకపోవడం లాంటి కారణాలు సైతం ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి.

● వేగ నియంత్రణకు..

రహదారులపై వాహనాలు అతివేగంతో వెళ్లకుండా రవాణా, పోలీసు శాఖల అధికారులు పర్యవేక్షించాలి. వాహనాలు నడిపే వారికి లైసెన్సు జారీ చేసేటప్పుడు ప్రభుత్వం అమలు పరిచే నిబంధనలపై అవగాహన కల్పించాలి. వారందరికీ సూచనలిస్తూ, నిబంధనాలను అతిక్రమిస్తే జరిగే నష్టాన్ని ముందుగానే తెలియజేయాలి. రహదారులపై వాహనాల వేగం, ప్రయాణికులు కిక్కిరిసిన వాహనాల్లో ప్రయాణించకుండా నిఘా ఉంచాలి. అతి వేగంతో వెళ్లే వాహనాదారులపై కఠిన చర్యలు తీసుకుంటే కొంత వరకైనా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

తహసీల్దార్ విర్‌సింగ్, ఏడీఏ లావణ్య

మల్లాపూర్, మే, 31 : పంట సాగు చెసే రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల టాస్క్‌ఫోర్స్ బృందం తహసీల్దార్ విర్‌సింగ్, కోరుట్ల ఏడీఏ లావణ్య, ఏఎస్సై లక్ష్మయ్యలు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లోని విత్తనాల దుకాణాలను మండల టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ముత్యంపటేలోని సొసైటీల్లోని ఎరువు నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కాలం చెల్లిన విత్తనాలు, నకిలీ విత్తనాలు విక్రయాలు చెయొద్దన్నారు. మండలంలో పంట సాగు చేసే రైతులకు సరిపడు జనుము, జిలుగు విత్తనాలను అందజేస్తామని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దన్నారు. లైసెన్స్‌లు కలిగిన డీలర్ల వద్ద రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని, రసీదులు పంటకాలం పూర్తయ్యే వరకు తమ వద్ద జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టాస్క్‌ఫోర్స్ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని రెండు విత్తనాల దుకాణాలను శుక్రవారం రెవెన్యూ, అగ్రికల్చర్, పోలీస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలోని కాటన్ విత్తనాల స్టాక్, అమ్మకపు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అధికారులు మాట్లాడుతూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తన చట్టం నిబంధనల మేరకు నడుచుకోని దుకాణాల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ టి. రాజమణి, ఏవో జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ రాజయ్య, రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బంది ఉన్నారు.

కోరుట్ల : పట్టణంలోని పలు విత్తన దుకాణాలను శుక్రవారం తహసీల్దార్ కిషన్, ఏఈవో నరేశ్ ఆకిస్మికంగా తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు స్టాక్ రిజిష్టర్లు ఎప్పకప్పుడు నిర్వహించాలని సూచించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనే సమయంలో రసీదు పొందాలని కోరారు.



ముత్యంపేటలోని ఎరువు నిలువలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాలరూరల్, మే 31 : అమ్మ ఆదర్శపాఠశాల కింద చేపట్టిన పనులను వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో చేపడుతున్న అన్ని కాంపోనెంట్ పనులను ఒకేసారి ప్రారంభించి పనులు నిర్వహించాలన్నారు. పనులు నాణ్యతతో చేయాల్సిన బాధ్యత ఆయా యాజమన్యాలపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, పంచాయితీరాజ్ ఏఇ రహమాన్, హౌసింగ్‌డిప్యూటీ ఈఈ రాజేశ్వర్, ఎంపీడీవోలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, పంచాయితీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్యాల: అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. మండలంలోని రాజారంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ పనుల బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట డీపీవో దేవరాజ్, పీఆర్ ఈఈ రహమాన్, హౌసింగ్ డిప్యూటీ ఈఈ రాజేశ్వర్, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు



ధరూర్ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

అధికారులను ఆశ్రయించిన మహిళా రైతు

బోయినపల్లి, మే 31: డ్రిప్ పరికరాలు అందించకపోవడంతో తాను రూ.30 లక్షల మేరకు నష్టపోయినట్లు బోయినపల్లి మండలం మర్లపేటకు చెందిన మహిళా రైతు శుక్రవారం వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించింది. గత ప్రభుత్వ హయాంలో అధికారులు పంట మార్పిడి చేయాలని రైతులను ప్రోత్సహించగా మర్లపేటకు చెందిన మహిళా రైతు భీంరెడ్డి విజయ తన 8 ఎకరాల్లో చెరకు పంటను సాగు చేశారు. డ్రిప్ పరికాల కోసం హార్టికల్చర్ శాఖకు దరఖాస్తు చేసుకొని జైన్ ఇరిగేషన్ సంస్థకు రైతు వాటా కింద రూ.1.14 లక్షలను 2022లో చెల్లించింది. అప్పటి నుంచి డ్రిప్ పరికరాలు రాకపోవడం, ఆశించిన దిగుబడి లేక రూ.30 లక్షల మేరకు నష్టపోయినట్లు రైతు విజయ వినయోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. రాష్ట్ర హార్టికల్చర్ అధికారికి, కలెక్టర్, జిల్లా ఉద్యాన అధికారికి అడ్వకేట్ ద్వారా నోటీసులు పంపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గొల్లపల్లి, మే 31 : గొల్లపల్లి మండలం అగ్గిమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013-14 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆపూర్వ సమ్మేళనం నిర్వహించారు. దశాబ్దం తర్వాత ఒకే చోట కలుసుకుని క్షేమసమాచారాలు ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. తాము చిన్ననాడు చదివిన పాఠశాలలో కలుసుకుని పాఠశాల మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. పాఠశాల అంతా కలియ తిరుగుతూ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. ఈ సందర్బంగా తమకు విద్యా నేర్పిన గురువులను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అక్కడే సామూహిక వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనంగా ఏర్పడ్డ పూర్వ విద్యార్థులు

రోడ్డు బాగైంది...బస్సు రద్దయింది..

● చింతకుంట - మెట్‌పల్లి ట్రిప్పులు రాక ప్రయాణికుల అవస్థలు ● అధికారుల తీరుపై అసంతృప్తి



పెగ్గెర్ల శివారులో నిర్మించిన తారు రోడ్డు

కథలాపూర్, మే 31 : 'సార్ మా పల్లెకు బస్సు నడపండి అని ఆర్టీసీ అధికారులకు గ్రామీణ ప్రాంతవాసులు మొరపెట్టుకుంటే...రోడ్డు బాగాలేదు మెరుగు పడ్డాక చూద్దాంలే' అనే సమాధానాలు రావడం సహజం. అయితే అందుకు భిన్నమైన పరిస్థితులు ఇక్కడ ఏర్పడ్డాయి.

మెట్‌పల్లి నుంచి పెద్దగుండు మీదుగా మం డలంలోని చింతకుంటకు ప్రతీ రోజూ రెండు ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడుపు తుండేవారు. రోడ్డు అధ్వానంగా ఉందనే కారణంగా బస్సును రద్దు చేశారని తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

● రోడ్డు బాగుపడ్డా నడపని బస్సులు

మెట్‌పల్లి డిపో నుంచి ఉదయం పూట, సాయంత్రం వేళల్లో బస్సు నడిచేది. పలు కారణాలు చూపిన అధికారులు అనూహ్యంగా బస్సును రద్దు చేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. అయితే ఇటీవల కొండ్రికర్ల, కోనరావుపేట, పెగ్గెర్ల గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈ క్రమంలో ప్రజా ప్రతినిధులు ఆర్టీసీ అధికారులకు మొరపెట్టుకుంటున్నా బస్సులను పునరుద్ధరించడం లేదని వాపోతున్నారు. ఈ రూట్ నుంచి కొద్ది రోజులు వేములవాడకు కూడా బస్సులు నడిపారు. ఆ బస్సును కూడా రద్దు చేయడంతో కొండ్రికర్ల, కోనరావుపేట, రాంరావుపల్లె గ్రామాల ప్రయాణికులు వేములవాడకు వెళ్లాలంటే కోరుట్ల మీదుగా వెళ్లి పుణ్యక్షేత్ర దర్శనం చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

● బస్సు పునరుద్ధరించాలి

పాలెపు బాలు, పెగ్గెర్ల



మెట్‌పల్లి వెళ్లాలంటే చింతకుంట బస్సు మంచి సౌకర్యవంతంగా ఉండేది. అధికారులు ఏవో సాకులు చూపి అర్థాంతరంగా నిలిపివేయడం దారుణం. ప్రతీ పల్లెకు బస్సు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా బస్సు పునరుద్ధరించాలి

● రోడ్డును మెరుగు చేసినా ఫలితం శూన్యం

రాపెల్లి గంగరాం, మాజీ సర్పంచ్ ఊట్‌పల్లి



చింతకుంట, ఊట్‌పల్లి, భూషణరావుపేట, కొండ్రికర్ల, కోనరావుపేట, రాంరావుపల్లి మీదుగా పూర్తిగా బీటీ రోడ్డు వేయడంతో ప్రయాణం సులువుగా మారింది. అయితే అధికారులు బస్సులు రద్దు చేసి ప్రయాణికులను కష్టాల్లోకి నెట్టారు. పల్లె ప్రజల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవాలి. సమస్యను పరిష్కరించాలి.

104 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల టౌన్, మే 31 :వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న 104 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో విప్ శుక్రవారం పర్యటించారు. ఇందిరా భవన్‌లో 104 ఉద్యోగులు విప్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. పెద్దపెల్లి జిల్లాలోని జూలపెల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన 104 ఉద్యోగి ఇటీవల గుండె పోటుతో మృతి చెందాడని ఆయన కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. అనంతరం లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాజ్ కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుని ఒకరికి ఔవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవేందర్ రెడ్డి, రాంచంద్రా రెడ్డి తదితరులు ఉన్నారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

రాయికల్, మే 31: మండలంలోని వడ్డెలింగాపూర్‌లో ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన అనుపురం హరీష్(29) శుక్రవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కికల్లు గీస్తుండగా అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతడిని కరీంనగర్ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. హరీష్‌కు భార్య నిఖిత ఉంది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గో సంరక్షణ పోస్టర్ ఆవిష్కరణ

కొడిమ్యాల, మే 31 : మండలంలోని చెప్యాల శివాలయంలో శుక్రవారం గో సంరక్షణ పోస్టర్‌ను విశ్వహిందు పరిషత్ కరీంనగర్ గోరక్ష ప్రముఖ్ ఊటుకూరి రాధాకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణలో ప్రతి ఒక్కరు గో సంతతిని కాపాపాడాలన్నారు. గోరక్ష చట్టాలను కఠినంగా అమలు చేసే విధంగా ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరుతూ జూన్ 7న బాగ్యనగర్ ఇందిరా పార్క్ వద్ద మధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి గో భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు, హన్మాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

నేడు సిరికొండలో పంచముఖ ఆంజనేయస్వామి జాతర

కథలాపూర్, మే 31 : మండలంలోని సిరికొండలో వేములవాడ - కోరుట్ల రహదారిపై ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి జాతర జూన్ 1న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 14వ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆంజనేయస్వామి అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గొల్లపల్లి, మే 31 : అప్పుల బాధ తాళలేక మద్యం మత్తులో ఈ నెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆడెపు వెంకటేశం (50) పరిస్థితి విషమించి అసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు..వెంకటేశం పని లేక మద్యానికి బానిసయ్యాడు. దీంతో అప్పులు పెరిగిపోయి అవి తీర్చే మార్గం లేక ఈ నెల 23న ఇంట్లో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. వారం రోజుల అనంతరం పరిస్థితి విషమించి అసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కొడుకు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

రాయికల్, మే 31: మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలో అంబల్ల ప్రతాప్ రెడ్డికి చెందిన కోళ్ల ఫారం అగ్ని ప్రమాదానికి గురి కాగా కాంగ్రెస్ నాయకులు తాటిపర్తి రాం చంద్రారెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి సంబంధిం చిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆలయంలో దేవాదాయ శాఖ సంయుక్త కమిషనర్ పూజలు

కోరుట్ల, మే 31 : పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాయిరామ ఆలయంలో శుక్రవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమీషనర్ రామకృష్ణారావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యనిర్వాహణ అధికారి, అర్చకులు, సిబ్బంది స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి

చందుర్తి, మే 31 : చందుర్తి మండలం మూడపల్లి బస్టాండ్ ప్రాంతంలోని ఒర్రెలో అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని తొలగించాలని మూడపల్లి, నర్సింగాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో లస్మయ్య అనే వ్యక్తి కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారి పక్కన ఒర్రెలో ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడని, వరద నీటికి నర్సింగాపూర్ వెళ్లే రోడ్డు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు.